## క్లుప్తంగా

### సామరస్యంగా పరిష్కరించుకోవాలి



అర్జీదారుల సమస్యలు వింటున్న మండల ప్రత్యేకాధికారి రహీమ్

మునగపాక: గ్రామాల్లో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రహీమ్ కోరారు. ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన అర్జీదారులతో మాట్లాడారు. చిన్న చిన్న వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. పెద్దల సమక్షంలో శాంతియుత వాతావరణంలో సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. వివాదాలకు పోకుండా సమన్వయంతో మెలగాలన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మునగపాకలో ఆక్రమణల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డివిజనల్ సర్వేయర్ వెంకన్న

మునగపాక: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారంటూ లోకాయుక్తలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డివిజనల్ సర్వేయర్ వెంకన్న శనివారం పరిశీలించారు. ఇక్కడ మెయిన్ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ప్రస్తుతం ఉన్న రహదారికి ఒకవైపుగా కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదు మేరకు ఆయన స్థానిక అధికారులతో కలిసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట మండల సర్వేయర్ రవీంద్ర పాల్ దాస్, వీఆర్వో సురేష్, స్థానిక సర్వేయర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాలకు పూజా సామగ్రి వితరణ



పూజా సామగ్రితో ట్రస్టు సభ్యులు

పాయకరావుపేట: దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయాలకు కార్తీకమాసం సందర్భంగా పూజా సామగ్రిని వితరణ చేయనున్నట్టు ట్రస్టు వితరణ సభ్యుడు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో సామూహిక వివాహాలు, సీమంతాలు, మారుమూల ప్రాంతాల్లో వరలక్ష్మి వ్రతాలు, అక్షరాభ్యాసాలు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్తీక మాసంలో ఐదు వేల దేవాలయాలకు పూజా సామగ్రి పంపిణీ చేస్తామన్నారు.

### మెరుగైన పారిశుధ్యంతో ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

కోటవురట్ల: పారిశుధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటితో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిదీ అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పీఆర్ జేఈ వర్మ, కార్యదర్శి రఘురాం, ఏపీవో నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### 3 రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట: మండలంలో మూడు రోడ్ల నిర్మాణానికి హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం శంకుస్థాపన చేశారు. రాజగోపాలపురం నుంచి కందిపూడి రోడ్డు రూ.60 లక్షల నాబార్డు నిధులతోను, గుంటపల్లి నుంచి ఒడ్డిమెట్ట మీదుగా జాతీయ రహదారికి రూ.85 లక్షలతోను పాయకరావుపేట నుంచి పెంటకోట వెళ్లే రోడ్డుకు మంగవరం వరకు రూ.కోటి నిధులతోను నిర్మించనున్నారు. వీటికి ఆమె శంకుస్థాపనలు చేశారు.

# మందకొడిగా బాణసంచా విక్రయాలు

- పెరిగిన ధరలతో తగ్గిన కొనుగోళ్లు
- వెలవెలబోతున్న దుకాణాలు



లైసెన్స్‌డ్ షాపులో మందుగుండు సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

పాయకరావుపేట: దీపావళి వస్తుందంటే వారం రోజులు ముందుగానే సందడి మొదలయ్యేది. ఈ ఏడాది వెలుగుల దీపావళి సందడి ఇంకా కనిపించలేదు. చిన్నారుల నుంచి పెద్దలు సైతం బాణసంచా కాల్పులపై మక్కువ చూపుతారు. పట్టణంలో బాణసంచా దుకాణాల వద్ద మందకొడిగా కొనుగోళ్లు సాగుతున్నాయి. గత రెండు సంవత్సరాలతోపాటు పోల్చుకుంటే అంతంత మాత్రంగానే బాణసంచా సామగ్రి అమ్మకాలు ఉండటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆది, సోమవారాల్లో అమ్మకాలు జోరందుకుంటే తప్ప నష్టాల నుంచి గట్టెక్కలేమని చెబుతున్నారు. మరో వైపు రెండు రోజుల నుంచి వివిధ రకాల ప్రమిదలు విక్రయిస్తున్నారు. ఓ పక్క వాతావరణం కూడా మబ్బులు మేఘాలతో ఉండటంతో దీపావళి సందడి మరింత లేకుండా పోయింది.

**పెరిగిన బాణసంచా ధరలు**

దీపావళి నాడు టపాసులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, బాంబులు, టపాసులు, తదితర సామగ్రితో అంగరంగ వైభవంగా సంబరాలు చేసుకునేవారు. కానీ ప్రస్తుత దీపావళి సామగ్రి రేట్లు కొద్దిగా పెరిగినప్పటికీ అనుకున్నంత స్థాయిలో అమ్మకాలు జరగడంలేదని వ్యాపారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఆర్థిక భారం ఒకటైతే, దీపావళి సామగ్రి మాత్రం ఖరీదు ఎక్కువ ఉందని పలువురు కొనుగోలుదారులు వాపోతున్నారు. క్రాకర్స్, సీమ టపాకాయలు, చిచ్చుబుడ్లు, మతాబులు కొనుగోలు చేయాలంటే వెయ్యి రూపాయలు వదిలించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

### నష్టాలు తప్పవు



గత సంవత్సరం కన్నా ప్రస్తుతం అమ్మకాలు తగ్గాయి. కొంతమేర సామగ్రి ధరలు పెరిగాయి. కానీ అమ్మకాలు మాత్రం చాలా మందకొడిగా ఉన్నాయి. వ్యాపారాలు నష్టం చవిచూడాల్సి వస్తుంది.

– కంభంపాటి వెంకటరమణ, లక్ష్మీగణేష్ ఫైర్ వర్క్స్, పాయకరావుపేట

### భద్రతా ప్రమాణాలు పాటించాలి



యండపల్లిలో ఫైర్ క్రాకర్స్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల: మందుగుండు సామగ్రి తయారీలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. యండపల్లిలోని ఫైర్ క్రాకర్స్ యూనిట్‌ను శనివారం సందర్శించి భద్రతా అంశాలను తనిఖీ చేశారు. యూనిట్ యజమాని రమణకు సూచనలు ఇచ్చారు. తయారీలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్మికులందరికీ బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. విక్రయాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

# సాక్షి పత్రికపై కక్ష సాధింపులు తగదు

- నక్కపల్లిలో పాత్రికేయుల ఆందోళన



డీటీకి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

నక్కపల్లి: ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ వాస్తవాలను ప్రచురిస్తున్న సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడటం, కేసులు బనాయించడం తగదని ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోరాడ చంద్రరావు, పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆచంట రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో నకిలీ మద్యం విక్రయాలకు సంబంధించి సాక్షి పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడాన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జ్, వార్తలు రాస్తున్న విలేకరులపై కేసులు బనాయించి 170 ప్రశ్నలతో కూడిన పత్రాలను అందజేసి వేధించడాన్ని నిరసిస్తూ శనివారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు ఆందోళన చేపట్టారు. ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ, చంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చర్యలు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన పత్రికలపై కక్ష సాధించడం, కేసులు నమోదు చేయడం తగదన్నారు. తప్పుడు వార్తలు రాస్తే తగిన ఆధారాలతో చర్యలు తీసుకోవడంలో తప్పులేదని, లేదా న్యాయ పోరాటం చేయొచ్చని పేర్కొన్నారు. అంతే తప్ప ఎడిటర్లపై, విలేకర్లపైన కేసులు నమోదు చేయడం అనే సంస్కృతి మంచిది కాదన్నారు. పత్రికలపై దాడులు అరికట్టాలని, ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని తక్షణమే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గుమ్మిళ్ల గోవిందు, పినపాత్రుని రాము, పి. పెంటయ్య, కె. హరి, ఎస్. రమణ బాబు, రమేష్, నాగేశ్వరరావు, పి. పెంటయ్య, ఎం. గణేష్, పి. సత్యనారాయణ, ముద్దారాజు, కె. తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

### 23న మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 18 కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తోపాటు, జెరాక్స్ కాపీలను వెంట తీసుకుని రావాలన్నారు. వివరాలకు 8247505171 నంబరును సంప్రదించాలని కోరారు.

### సులభరీతిలో బోధన



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సుకుమార్

కోటవురట్ల: విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన ఉండాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సుకుమార్ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సుకుమార్ మాట్లాడుతూ బోధన సులభరీతిలో ఉండాలన్నారు. నూతన ఒరవడిని సృష్టించి విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలన్నారు. బోధనతో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

# మొక్కుబడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం ఒంటి గంటన్నరకు ప్రారంభమైంది. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చడానికి సిబ్బందిని పెంచాలని సభ్యులు కోరారు. దీంతో ప్రస్తుతం ఎంతమంది సభ్యులు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అడగ్గా 90 మంది పనిచేస్తున్నారని అధికారులు చెప్పారు. పట్టణంలో రోజుకు ఎంత చెత్త ఉత్పత్తవుతోందో చెప్పాలని అడిగినపుడు 16 టన్నుల చెత్త వస్తోందని అధికారులు బదులిచ్చారు. పారిశుధ్య కార్మికులు రోజుకు 8 గంటలు సక్రమంగా పనిచేస్తే ఇబ్బంది ఉండదు కదా అని ఎమ్మెల్యే చెప్పినపుడు చైర్‌పర్సన్ మధ్యలో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ఎమ్మెల్యే కుర్చీలోంచి లేచి నిలబడి మైకును బల్లపై పెట్టేశారు. అనంతరం ఎమ్మెల్యే కొద్దిసేపు తనదైన శైలిలో అధికారులు, పాలకవర్గానికి క్లాసు పీకారు. అజెండాలోని అంశాలపై చర్చ పూర్తిగా జరగకుండానే సమావేశం మొక్కుబడిగా ముగించారు. అంతకు ముందు ఎమ్మెల్యే సమావేశానికి రెండున్నర గంటలు ఆలస్యంగా రావడంతో కౌన్సిలర్లు, అధికారులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

### ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ సేవలు అభినందనీయం

నక్కపల్లి: చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని ఎంఈవో– 2 నాగన్నదొర, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలాజీ తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో క్లస్టర్ స్థాయిలో విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, పోయమ్స్ వంటి 12 రకాల పోటీలు శనివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటరమణ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఆచార్యులు, ఫాల్గుణరావు, నానాజీ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని అడ్డుకుంటాం

- నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



అచ్యుతాపురం కోటి సంతకాల సేకరణ చేపడుతున్న కరణం ధర్మశ్రీ

అచ్యుతాపురం: మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని తప్పకుండా అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని అచ్యుతాపురం, చోడపల్లి, దొప్పెర్ల గ్రామాల్లో నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బాబు హయాంలో అన్ని అబద్ధపు హామీలేనని విమర్శించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాల్సిన మెడికల్ కళాశాలలను ఎందుకు ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలు తెలిసేలా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, కోన లచ్చన్నాయుడు, ఎంపీటీసీ జువ్వాల నాయుడు, సర్పంచ్ సంజీవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### బ్రాండిక్స్ సిబ్బందికి దీపావళి కానుక

అచ్యుతాపురం: సెజ్‌లో బ్రాండిక్స్ పరిశ్రమ ఉద్యోగులకు ముందే దీపావళి వచ్చింది. సంస్థ పరిధిలో పనిచేస్తున్న 14 వేల మందికి దీపావళి బహుమతులను యాజమాన్యం అందజేసింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం అదనపు టారిఫ్‌ల విధింపుల నేపథ్యంలో సంస్థ కష్టకాలంలో ఉన్నప్పటికీ సిబ్బందిలో మానసిక ధైర్యాన్ని నింపే విధంగా బహుమతులు పంపిణీ చేపట్టామన్నారు.

# ఉత్సాహంగా ముగిసిన స్కూల్ గేమ్స్



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



అండర్ 14 వాలీబాల్ టీం విజయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో రెండో రోజు బాలుర విభాగంలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఉత్సాహ భరితంగా సాగాయి. 16 పాఠశాల నుంచి 8 రకాల క్రీడలకు 360 విద్యార్థులు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్రీడలు ఆడించి విజేతలను ఎంపిక చేశారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలు పోటాపోటీగా సాగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న విజేత జట్లను నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. పోటీల్లో విజేతల వివరాలు.. అండర్ –17 విభాగంలో వాలీబాల్ వమ్మవరం, దార్లపూడి, కబడ్డీలో నారాయణపట్నం, దార్లపూడి, ఖోఖోలో పెదఉప్పలం, కొరుప్రోలు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్ –14 విభాగంలో వాలీబాల్, కొరుప్రోలు, ఎస్.రాయవరం విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు, మండల కోఆర్డినేటర్ కొరుప్రోలు పీడీ అమ్మోరియా అభినందనలు తెలిపారు.

పాయకరావుపేట: మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 250 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు క్రీడల మండల కో ఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. అండర్–14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామన్నారు. శనివారం క్రీడలు ముగింపు సందర్భంగా విజేతలను ఎంపిక చేశామన్నారు.

### బాణసంచా దుకాణాలకు నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: టపాసుల దుకాణదారులు భద్రతా ప్రమాణాల మధ్య బాణసంచా వ్యాపారాలు నిర్వహించుకోవాలని యలమంచిలి సీఐ ఎస్ ధనుంజయరావు సూచించారు. శనివారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా రాబోయే దీపావళిని ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. బాణసంచా నిల్వలు, ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుపై పోలీసు శాఖ తరపున తాము తనిఖీలు చేపడతామన్నారు. బాణసంచా దుకాణాల వద్ద నిర్ణీత దూరం ఉంచడంతోపాటు అగ్ని నిరోధక సిలిండర్లు, బక్కెట్లు, పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర, ఆచారి పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి



నాగులాపల్లిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు భాగస్వాములయ్యారు. గ్రామంలో చెత్త తొలగింపుతోపాటు మురుగు నిలువ లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలు సహకరించాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు కోరారు. ఇంటి ముందు నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. ఉప సర్పంచ్ గోసాల గోవింద్, గ్రామస్తులు యల్లపు వెంకట భాస్కరరావు, పాలమరశెట్టి నాగు, భీమిశెట్టి సత్యనారాయణ, దొడ్డి వీర వెంకటరావు, పాలమరశెట్టి నూకాలయ్య, కర్రి సరోజిని, రామేశ్వరరావు, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం మునగపాకలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. చెత్తను రోడ్డుపై పోసేయకుండా ప్రత్యేక బుట్టల్లో వేయాలన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోపీఆర్డీ సోమరాజు, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ లక్ష్మి, మండల పరిషత్ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పూడిమడక రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

మునగపాక: స్థానిక పూడిమడక రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. నిత్యం ఈ రోడ్డులో వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డు కుంగిపోవడంతో రాత్రి పూట ప్రయాణంలో ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 7వ తేదీన 'కుంగిపోతున్న రోడ్డు' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కుంగిన రోడ్డుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బాలికలకు చట్టపరమైన హక్కులు



బహుమతులతో విద్యార్థినులు

కోటవురట్ల: విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు బాలికలకు అందేలా చూడడం అందరి బాధ్యతని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. బాలికలు తమ హక్కులను తెలుసుకుని కాపాడుకునేందుకు ప్రయత్నించాలన్నారు. సమాజంలో లింగ వివక్షను రూపుమాపడం, బాల్య వివాహాలను అరికట్టడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఎంఈవో రామారావు, కార్యదర్శి రఘురాం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం తగదు



తిమ్మరాజుపేటలో కోటి సంతకాలపై అవగాహన కల్పిస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జి సూర్యనారాయణ

మునగపాక: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని విరమించుకోవాలని క్లస్టర్ ఇన్‌చార్జి నరాలశెట్టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని తిమ్మరాజుపేట, పల్లపు ఆనందపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుతంత్రాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, ఉప సర్పంచ్ శరగడం జగన్నాథరావు, పార్టీ నేతలు ఆడారి గణేష్, మురళి, కర్రి పెదబ్బాయి, ముత్యాల భాస్కరరావు, కాండ్రేగుల జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



మాట్లాడుతున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. మునగపాక, గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శనివారం ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంపుదలతో పాటు అభ్యసన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. హెచ్‌ఎంలు రోజామణి, మట్టా శ్రీనివాసరావు, గాలి అప్పారావు, శంకరరావు, ఆర్‌పీలు ఎంవై రాము, విజయవాణి, కళ్యాణ్, సృజన, సీఆర్‌ఎంటీలు లక్ష్మీనారాయణ, గోవింద, సూకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

మునగపాక: ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని ఎంఈవో బుద్ధ శివనాయుడు పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షకు సంబంధించి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేందుకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయన మునగపాకలో పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు రచించిన పుస్తకాలను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రేబాక రవి కుమార్, పీలా ఆశా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.